సాక్షి
రంగారెడ్డి
సోమవారం ▪ 21 ▪ జూలై ▪ 2025



దూసుకొచ్చిన మృత్యువు

అతివేగంతో దూసుకెళ్లిన కారు రోడ్డు పక్కన మొబైల్ టిఫిన్ సెంటర్‌ను ఢీకొట్టడంతో నిర్వాహకుడు మృతి చెందాడు. 8లో▸



మొయినాబాద్: బోనాలతో మహిళలు



షాబాద్: మక్తగూడలో బోనంతో చిన్నారి



మొయినాబాద్: సురంగల్‌లో బోనాల ఊరేగింపు

❖ బోనం.. వైభవం

ఆషాఢ బోనాల ఉత్సవాలు ఆదివారం జిల్లాలోని పలు గ్రామాల్లో అంగరంగ వైభవంగా జరిగాయి. మహిళలు బోనాలతో ఊరేగింపుగా బయలుదేరారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. చల్లంగ చూడాలని వేడుకున్నారు. డప్పుల దరువులు.. శివసత్తుల పూనకాలు.. పోతురాజుల విన్యాసాలు.. యువత కేరింతలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది.



చేవెళ్ల: అంబేడ్కర్ కాలనీలోని పోచమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

న్యూస్‌రీల్

మైసమ్మ సన్నిధిలో అచ్చంపేట ఎమ్మెల్యే



కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవతను ఆదివారం ఉదయం అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు తీర్థ ప్రసాదం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ నరేశ్‌నాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు జవహర్‌లాల్, హీరాసింగ్, తులసీ రాంనాయక్, మహేందర్‌గౌడ్ ఉన్నారు.

గెస్ట్ అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

చేవెళ్ల: మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ అధ్యాపకుల పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హిస్టరీ, కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో బోధనకు దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ డిగ్రీ పొంది ఉండాలని చెప్పారు. జనరల్ అభ్యర్థులు కనీసం 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ వర్గాలు 50 శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. అనుభవం, పీహెచ్‌డీ లాంటి అదనపు అర్హతలు కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తిగల, అర్హులైన అభ్యర్థులు సంబంధిత జిరాక్స్ ధ్రువపత్రాలతో కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయి



సమావేశంలో మాట్లాడుతున్న పాలమాకుల జంగయ్య

తుర్కయంజాల్: దేశంలో ఆర్థిక అసమానతలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, సామాజిక అభివృద్ధి కుంటుపడి పోతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన పార్టీ మున్సిపాలిటీ రెండో మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అసమానతలు లేని సమాజం కోసం పుట్టిందే ఎర్రజెండా అని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో పేదలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని, దేశంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య మత విద్వేషాలతో చిచ్చు పెడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ స్టేట్ కంట్రోల్ కమిషన్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్ రావు, రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య, కావలి నర్సింహ, పానుగంటి పర్వతాలు, జిల్లా కార్యవర్గ సభ్యురాలు నీలమ్మ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి.శివ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ




సీడ్‌బాల్స్ చల్లుతున్న పోలీసులు

పరిగి: నేడు నాటిన మొక్క రేపటి తరానికి మేలు చేస్తుందని పరిగి సబ్‌జైల్ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం పతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవంలో భాగంగా జైళ్ల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పరిగి పరిసర ప్రాంతాల్లో 200 సీడ్‌బాల్స్ చల్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీడ్ బాల్స్ చల్లడంతో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో మొక్కలను నాటే వీలుంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జైళ్ల శాఖ ఇప్పటి వరకు 2 లక్షల సీడ్‌బాల్స్ తయారు చేసి చల్లామన్నారు. జైళ్ల శాఖ పెట్రోల్ బంక్‌ల్లో సీడ్‌బాల్స్‌ని ఉచితంగా పంపిణీ చేస్తున్నామని ప్రతీ ఒక్కరూ చల్లాలని సూచించారు. కార్యక్రమంలో జైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఉండలేం.. వచ్చేస్తాం!

జైళ్లను తలపిస్తున్న కార్పొరేట్ కాలేజీ హాస్టళ్లు

- కరువైన మౌలిక వసతులు
- విరామం లేకుండా తరగతులు
- ఒత్తిడి తట్టుకోలేకపోతున్న విద్యార్థులు
- ఇళ్లకు వచ్చేస్తామంటూ తల్లిదండ్రులకు వేడుకోలు
- కొరవడిన ప్రభుత్వ నియంత్రణ



సాక్షి, రంగారెడ్డిజిల్లా: కార్పొరేట్ జూనియర్ కాలేజీ వసతి గృహాలు చెరసాలలను తలపిస్తున్నాయి. ఉదయం నిద్ర లేచింది మొదలు.. విరామం లేకుండా తరగతులు నిర్వహిస్తుండటం.. కాలకృత్యాలు తీర్చుకోవడానికి కూడా సమయం లేకపోతుండటంతో విద్యార్థులు ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నారు. ఉండలేం.. వచ్చేస్తామంటూ బోరుమంటున్నారు. ఇంటర్మీడియెట్‌లో మెరుగైన ఫలితాలు, పోటీ పరీక్షల్లో ర్యాంకుల సాధన కోసం చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను కార్పొరేట్‌కాలేజీ వసతి గృహాల్లో చేర్పిస్తున్నారు. పిల్లల శక్తిసామర్థ్యాలు, ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండా చేర్పిస్తుండటంతో చేరిన కొద్ది రోజులకే అక్కడ తాము చదవలేమని.. తిరిగి ఇంటికి తీసుకెళ్లిపోవాలని తల్లిదండ్రులకు ఫోన్లు చేస్తున్నారు. కొంతమంది ఏమీ తినకుండా కడుపుమాడ్చుకుని నీరసంతో ఆస్పత్రుల్లో చేరుతుండగా.. మరికొంత మంది ఏకంగా బలవన్మరణాలకు పాల్పడడం ఆందోళన కలిగిస్తోంది. అప్పటికే సగానికిపైగా ఫీజులు చెల్లించిన తల్లిదండ్రులు చేసేది లేక.. పిల్లలకు సర్దిచెబుతున్నారు.

ఉదయం నుంచే ఉరుకులు పరుగులు

జిల్లాలో 17 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, 214 ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు ఉన్నాయి. ఒక్కో వసతి గృహంలో రెండు వేల నుంచి మూడు వేల మంది పిల్లలు చదువుతున్నారు. ఒక్కో గదిలో ఆరు నుంచి ఎనిమిది మందిని ఉంచుతున్నారు. వీరందరికీ ఒక్కటే మూత్రశాల, మరుగుదొడ్డి, స్నానాల గది ఉండటంతో ఉదయం నాలుగు గంటలకే నిద్ర లేచి బాత్‌రూమ్‌ల ముందు క్యూ కడుతున్నారు. మరోవైపు ఇంటర్మీడియెట్ సబ్జెక్టును త్వరగా పూర్తి చేసి, ఐఐటీ, జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుంటారు. నిత్యం ఉదయం ఆరు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు క్లాసులు జరుగుతుంటాయి. అల్పాహారం..మధ్యాహ్న భోజనం కోసం గంటన్నర మినహా ఇతర సమయంలో విరామం అంటూ లేకుండా పోతోంది. రాత్రి 11 తర్వాతే నిద్రపోవాల్సి వస్తోంది. కంటికి కునుకులేక, క్లాసులో లెక్చరర్ చెప్పింది అర్థం కాక, భోజనం నాసిరకంగా ఉండటంతో తరచూ అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చేరుతున్నారు.

చిన్నతనంలోనే పెద్ద జబ్బులు

సాధారణంగా ఎదిగే వయసులో ఉన్న పిల్లలకు కనీస వ్యాయామం అవసరం. కానీ వసతి గృహాల్లో చదువుకుంటున్న వారికి ఆ సమయమే దొరకడం లేదు. చాలామంది పిల్లలు విటమిన్ డి లోపంతో బాధపడుతున్నారు. రోజుకు పదహారు గంటల పాటు కూర్చోవాల్సి వస్తుండటం, కంటికి నిద్రలేకపోవడం, శరీరానికి కనీస వ్యాయామం లేకపోవడంతో చిన్నతనంలోనే ఒత్తిడికి గురవడంతోపాటు ఊబకాయులుగా మారుతున్నారు. నిజానికి ప్రతి కాలేజీలో మానసిక నిపుణులను నియమించాల్సి ఉన్నా.. ఎక్కడా పాటించడం లేదు. కౌన్సెలింగ్ నిర్వహించే వాళ్లు లేకపోవడంతో ప్రతి చిన్న విషయానికి మానసికంగా కుంగిపోతూ చివరికి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు.

అద్దెభవనాలు.. అరకొర వసతులు

మెజార్టీ కాలేజీలు అపార్ట్‌మెంట్లలోనే కొనసాగుతున్నాయి. కనీసం ఫైర్‌సేఫ్టీ కూడా లేని బహుళ అంతస్తుల భవనాలను అద్దెకు తీసుకుని వసతితో పాటు తరగతులు నిర్వహిస్తున్నారు. నిజానికి వీటిలో తరగతుల నిర్వహణకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. వసతి గృహాల నిర్వహణకు అనుమతులు లేవు. అయినా ఆయా భవనాల్లో తాత్కాలికంగా చిన్నచిన్న గదులను ఏర్పాటు చేసి ఒక్కో గదిలో ఎక్కువ మంది విద్యార్థులను కుక్కేస్తున్నారు. ఏడాదికి రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ కనీసం మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. కార్పొరేట్ యాజమాన్యాలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, పరోక్షంగా వాటికి కొమ్ము కాస్తోందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

అలవాటుపడలేక..



అప్పటి వరకు సాధారణ పాఠశాలలో చదువుకున్న పిల్లలను ఒకేసారి కార్పొరేట్ కాలేజీ హాస్టళ్లలో చేర్పించడంతో ఆ వాతావరణానికి ఇబ్బంది పడుతున్నారు. విరామం లేకుండా తరగతుల నిర్వహణతో మరింత ఒత్తిడికి లోనవుతున్నారు. పిల్లల మానసిక పరిస్థితిని తల్లిదండ్రులతో పాటు లెక్చరర్లు అర్థం చేసుకోవాలి. వారికి నచ్చజెప్పి ఇష్టంగా చదివే విధంగా తయారు చేయాలి.

– డాక్టర్ నాగేందర్, మహేశ్వరం మెడికల్ కాలేజీ



సమావేశంలో పాల్గొన్న సంఘం నాయకులు

డిమాండ్లు పరిష్కరించాలి

పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న పంచాయతీ కార్యదర్శుల డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. హయత్‌నగర్‌లోని అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 14 నెలలుగా పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న చెక్కులను వెంటనే విడుదల చేయడంతో పాటు కార్యదర్శుల క్యాడర్ స్ట్రెంత్ పెంపుదలను వేగవంతం చేయాలన్నారు. ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేస్తూ ఓపీఎస్‌లను వెంటనే క్రమబద్ధీకరించాలని, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నాలుగు సంవత్సరాల సర్వీసును పరిగణలోకి తీసుకుంటూ పదోన్నతులు కల్పించాలని కోరారు. జీఓ నం.317 ద్వారా నష్టపోయిన పంచాయతీ కార్యదర్శులను వారి సొంత జిల్లా లేదా జోన్‌లకు బదిలీ చేయాలని, మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ విధానంలో నియమించిన కార్యదర్శులకు సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ.శ్రీనివాస్, కోశాధికారి పండరినాథ్, రాష్ట్ర కమిటీ సభ్యులు, వివిధ జిల్లాలకు చెందిన సంఘం జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.

వైభవంగా పవిత్రోత్సవాలు

కొడంగల్: పట్టణంలోని బాలాజీనగర్‌లో వెలిసిన పద్మావతి సమేత మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. టీటీడీ నుంచి వచ్చిన అర్చకులు మొదటిరోజు ఆదివారం ఉదయం వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా యాగశాలలో శత కలశ తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు యాగశాలలలో విశేష హోమాలు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి వారిని పవిత్ర మండపంలో ఏర్పాటు చేసిన యాగశాలలో ప్రత్యేక పూజలు జరిపించారు. పవిత్రోత్సవాల్లో పాల్గొన్న వారు ఓం నమో వేంకటేశాయ నమః అంటూ పరవశించిపోయారు. గోవింద నామస్మరణతో యాగశాల మార్మోగింది. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.



పూజలందుకున్న స్వామివారు

అడ్డగోలు బాదుడు!

- ఆటోలు, క్యాబ్‌లకు అనూహ్యంగా డిమాండ్
- ఇష్టారాజ్యంగా పెంచేసిన చార్జీలు
- మెట్రో రైళ్లలోనూ విపరీతమైన రద్దీ



సాక్షి, సిటీబ్యూరో: తిరుమలగిరి ఆర్టీసీ కాలనీకి చెందిన శ్రీనివాస్ ఆదివారం సాయంత్రం తార్నాక నుంచి ఇంటికి వెళ్లేందుకు క్యాబ్‌ను ఆశ్రయించాడు. సాధారణంగా క్షణాల్లో బుక్ అయిపోయే సమయానికి అనూహ్యంగా డిమాండ్ నెలకొంది. చివరకు పావుగంట తర్వాత ఓ అగ్రిగేటర్ సంస్థకు చెందిన క్యాబ్ బుక్ అయింది. ఆన్‌లైన్ యాప్‌లో కనిపించిన చార్జీలు చూసి అతడు బెంబేలెత్తాడు. సాధారణంగా తార్నాక నుంచి తిరుమలగిరికి రూ.250 లోపే ఉంటుంది. కానీ ఆదివారం సాయంత్రం ఏకంగా రూ.530 వరకు పెరిగింది. గత్యంతరం లేక ఎక్కువ చెల్లించేందుకు సిద్ధపడి క్యాబ్ ఎక్కేశాడు. ఇది కేవలం శ్రీనివాస్‌కు ఎదురైన సమస్య మాత్రమే కాదు, చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు క్యాబ్ అగ్రిగేటర్లకు కాసులు కురిపిస్తున్నాయి. ఆటోలు, క్యాబ్‌ల నిర్వహణలో స్లాక్ (రద్దీ లేని), పీక్ (రద్దీ ఉన్న) సమయాలుగా ఎలాంటి విభజన లేకపోయినప్పటికీ అడ్డగోలుగా చార్జీలు పెంచి ప్రయాణికుల జేబులు గుల్ల చేస్తున్నారు. క్యాబ్ అగ్రిగేటర్‌లు ఇష్టారాజ్యంగా చార్జీలను పెంచకుండా అరికట్టేందుకు నియంత్రణ చర్యలు తీసుకోవాలనే ప్రతిపాదన ఉన్నప్పటికీ రవాణా శాఖ ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. దీంతో చార్జీలపైనియంత్రణ కొరవడింది.

ఆన్‌లైన్‌లోనే బేరసారాలు

కొన్ని అగ్రిగేటర్ సంస్థలు ఆన్‌లైన్‌లోనే బేరసారాలకు దిగుతున్నాయి. ఉప్పల్‌కు చెందిన ఓ ప్రయాణికుడు సికింద్రాబాద్ వరకు వెళ్లేందుకు ఒక ఆటోను బుక్ చేసుకున్నాడు. మొదట రూ.150 వరకు చార్జీలు కనిపించాయి. సరేననుకొని ప్రయాణానికి సిద్ధమయ్యాడు. ఎంపిక చేసుకున్న చార్జీలకు డ్రైవర్ సుముఖంగా లేడంటూ ఐదు నిమిషాల తర్వాత మొబైల్ స్క్రీన్‌పై కనిపించింది. అదనపు చార్జీలు చెల్లిస్తే ఆటో లభించవచ్చని సంకేతం, దాంతో మరో రూ.20 అదనంగా చెల్లించేందుకు సిద్ధమయ్యాడు. అయినా ఆటో రాలేదు. చివరికి రూ.50 ఎక్కువ చెల్లించేందుకు అంగీకరించిన తర్వాత క్షణాల్లో ఆటో వచ్చింది. దీంతో సదరు ప్రయాణికుడు బిత్తరపోయాడు. ఇలా కొన్ని ఆటో, క్యాబ్ అగ్రిగేటర్ సంస్థలు ఆన్‌లైన్‌లోనే బేరసారాలకు దిగుతున్నాయి. మొదట తక్కువ చార్జీ ప్రదర్శించి ఆ తర్వాత ప్రయాణికుడి అత్యవసరాన్ని సొమ్ము చేసుకొనేందుకు బేరసారాలకు దిగుతున్నాయి.

- కొన్ని అగ్రిగేటర్ సంస్థలకు చెందిన యాప్‌లలో ఈ ఆప్షన్ కొత్తగా కనిపించడం గమనార్హం. మరోవైపు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి రాకపోకలు సాగించే ప్రయాణికులకు మాత్రం పలు సంస్థలకు చెందిన క్యాబ్‌లు పట్టపగలు చుక్కలు చూపిస్తున్నాయి. క్యాబ్ బుక్ అయిన తర్వాత ఆకస్మికంగా రద్దవుతున్నాయి. ఎంపిక చేసుకున్న క్యాబ్ కోసం చాలా సేపటి వరకు పడిగాపులు కాసి చివరకు ప్రయాణికులే తమకు తాముగా రద్దు చేసుకొనేవిధంగా కొందరు డ్రైవర్లు వ్యవహరిస్తున్నారు.

మెట్రోల్లో పెరిగిన రద్దీ

వివిధ మార్గాల్లో మెట్రో రైళ్లలోనూ రద్దీ కనిపించింది. బోనాల సందర్భంగా ప్రయాణికులు వివిధ ప్రాంతాల మధ్య ఎక్కువగా రాకపోకలు సాగించారు. దీంతో నాగోల్–రాయదుర్గం, ఎల్బీనగర్–మియాపూర్ కారిడార్‌లలో సాయంత్రం పలు మెట్రో స్టేషన్‌లలో సందడి నెలకొంది, సాధారణంగా సెలవు రోజుల్లో రద్దీ తగ్గుముఖం పడుతుంది. ఆదివారం బోనాల వేడుకలు, వర్షం కారణంగా ప్రయాణికులు మెట్రో రైళ్లను ఆశ్రయించారు.



'ఓపెన్' చాన్స్

చదువు మధ్యలో మానేసిన వారికి..

- పదోతరగతి, ఇంటర్‌లో అడ్మిషన్లు
- ప్రత్యేక అధ్యయన కేంద్రాలు
- ఈనెల 31 వరకు గడువు
- అపరాధ రుసుముతో 28 ఆగస్టు వరకు

కేశంపేట: అనివార్య కారణాలతో మధ్యలోనే చదువు నిలిపివేసిన యువతీ యువకులకు ఓపెన్ స్కూల్ వరంగా మారింది. చదువుకోవాలనే ఆశ ఉన్నా పాఠశాలలకు వెళ్లలేని వారికి చేయూతనివ్వాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ద్వారా విద్యను అందిస్తోంది. డ్రైవింగ్ లైసెన్స్ కావాలన్నా, కొన్ని ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందాలన్నా పదో తరగతి ఉత్తీర్ణత అవసరం. దీంతో చాలా మంది ఓపెన్ విద్య వైపు ఆసక్తి కనబరుస్తున్నారు. పనులు చేసుకుంటూనే సెలవు దినాల్లో తరగతులకు హాజరుకావచ్చు.

అధ్యయన కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా 65 ఓపెన్ టెన్త్, ఇంటర్ అధ్యయన కేంద్రాలు ఉన్నాయి. వీటిలో పహాడీషరీఫ్ జెడ్పీ ఉన్నత పాఠశాల, హఫీజ్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాల, ఎన్టీఆర్ నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఉర్దూ మీడియంలో సైతం చదువుకునే అవకాశం ఉంది. వికారాబాద్ జిల్లాలో 28 ఓపెన్ టెన్త్, ఇంటర్ అధ్యయన కేంద్రాలు, మేడ్చల్ జిల్లాలో 34 అధ్యయన కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వం నిధులు వెచ్చిస్తూ తోడ్పాటు అందిస్తోంది.

వీరు అర్హులు

- చదువు మధ్యలో ఆపేసినవారు, గృహిణులు, వివిధ కారణాలతో చదువుకు దూరమైన వారు, ఓపెన్ విద్యలో అడ్మిషన్లు పొందొచ్చు.
- 14 ఏళ్లు నిండిన వారు పదో తరగతిలో అడ్మిషన్ పొందేందుకు అర్హులు.
- ఆన్‌లైన్ లేదా మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకొని సమీపంలోని అధ్యయన కేంద్రాల్లో సమర్పించాలి.
- అడ్మిషన్లు పొందిన వారు సెలవు దినాల్లో నిర్వహించే తరగతులకు హాజరు కావాల్సి ఉంటుంది.
- మరింత సమాచారం కోసం www.telanganaopenschool.orgలో సంప్రదించాలి.

పదో తరగతి ప్రవేశాలకు..

- 14 సంవత్సరాల వయస్సు నిండిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.
- పదవ తరగతిలో ఐదు సబ్జెక్టులు మాత్రమే ఉంటాయి.
- గతంలో పదో తరగతి రెగ్యులర్ పరీక్షలు రాసి ఫెయిల్ అయిన వారు ఓపెన్‌లో రెండు సబ్జెక్టుల మార్కులను బదలాయించుకోవచ్చు.
- రూ.1,150 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.
- ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందిస్తుంది.
- అడ్మిషన్ తీసుకున్న తర్వాత ఐదేళ్ల వరకు పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు..

- ఇంటర్మీడియెట్ అడ్మిషన్ల కోసం పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
- పదో తరగతి పాసై ఒక్క సంవత్సరం గ్యాప్ ఉంటేనే అర్హులు.
- విద్యార్థులకు ఐదు సబ్జెక్టులు మాత్రమే ఉంటాయి.
- రూ.1,500 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.
- ప్రభుత్వం ఉచితంగా పాఠ్యా పుస్తకాలు అందిస్తుంది.

అవసరమైన పత్రాలు

- ఇటీవల తీసిన పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు
- ఆధార్‌కార్డు
- ఇంటర్మీడియెట్ చదివేవారికి ఎస్‌ఎస్‌సీ సర్టిఫికెట్
- పుట్టిన తేదీ సర్టిఫికెట్ (పదో తరగతి అడ్మిషన్‌కు)

ఆగస్టు వరకు అవకాశం

- పదో తరగతి, ఇంటర్మీడియెట్ చదివేందుకు ఈనెల 31 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా అడ్మిషన్ ఫీజుతో పాటు స్కూల్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.
- అపరాద రుసుం చెల్లించి ఆగస్టు 28వ తేదీ వరకు అడ్మిషన్లు పొందొచ్చు.

అక్షరాస్యులుగా మార్చేందుకు ..

నిరక్ష్యరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా పాఠశాలల్లో చదివే విద్యార్థుల నుంచి నిరక్షరాస్యులైన తల్లిదండ్రుల వివరాలు, మహిళా సంఘాల నుంచి నిరక్షరాస్యుల వివరాలు సేకరిస్తోంది. వీరిలో పదో తరగతి వరకు చదవలేని వారు, చదువును మధ్యలో ఆపేసిన వారు, చదవడం, రాయడం వచ్చిన వారిని ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతిలో చేర్పించేందుకు ప్రతి మండలంలో అధ్యయన కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



చదువును మధ్యలో అపివేసిన వారు, చదువుపై ఇష్టం ఉన్నవారికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రతి మండల కేంద్రంలో ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాలను ఏర్పాటు చేశాం. అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలి. సద్వినియోగం చేసుకోవాలి.

– సత్యనారాయణ, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల కోఆర్డినేటర్

దూసుకొచ్చిన మృత్యువు

కారు ఢీకొట్టడంతో
మొబైల్ టిఫిన్ సెంటర్ నిర్వాహకుడి మృతి


మొబైల్ టిఫిన్ సెంటర్‌ను ఢీకొట్టిన కారు

మొయినాబాద్: అతివేగంతో దూసుకెళ్లిన కారు రోడ్డు పక్కన ఉన్న మొబైల్ టిఫిన్ సెంటర్‌ను ఢీకొట్టడంతో నిర్వాహకుడు మృతి చెందాడు. అతని భార్యకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హిమాయత్‌నగర్ సమీపంలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం చౌదర్‌పల్లికి చెందిన దోమ ఉషయ్య(45) బండ్లగూడ జాగీర్‌లో అద్దెకు ఉంటూ మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ సమీపంలో హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి పక్కన మొబైల్ టిఫిన్ సెంటర్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం ఉదయం టిఫిన్ సెంటర్ తెరిచి ఊడుస్తుండగా మొయినాబాద్ నుంచి అప్పా వైపు అతివేగంతో వెళ్తున్న కారు దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టి ఉషయ్యను మొబైల్ టిఫిన్ సెంటర్‌ను ఢీకొట్టింది. దీంతో ఆయనకు తీవ్రగాయాలకు కాగా, అతని భార్య యశోదకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే ఉషయ్యను నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఒంటరి జీవితంపై విరక్తి చెంది

ఉరి వేసుకొని యువకుడి బలవన్మరణం


లింగం (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామంలో ఆదివారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఏఎస్ఐ గోపాల్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నల్ల లింగం(24) అవివాహితుడు. తల్లిదండ్రులు చనిపోవడం, దివ్యాంగుడైన సోదరుడు కృష్ణకి సైతం వివాహం కాకపోవడంతో యాదగిరిగుట్టకు మకాం మార్చాడు. ప్రస్తుతం గ్రామంలో లింగం ఒంటరిగా ఉంటున్నాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నెల 15న అతడు కూలీ పనికి వెళ్లిన మరుసటి రోజు నుంచి కనిపించలేదు. అతడి ఇల్లు గ్రామంలో చివరగా ఉండటంతో అటువైపు ఎవరు చూడలేదు. శనివారం రాత్రి ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్ఐ గోపాల్ ఆదివారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకొని తలుపులు తెరిచి చూడగా లింగం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం బంధువులకు అప్పగించారు. మృతుడి బంధువు నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బెల్ట్‌షాపులపై పోలీసుల దాడి

59 లీటర్ల మద్యం స్వాధీనం

మొయినాబాద్: బోనాల పండుగ సందర్భంగా వైన్ షాపులు బంద్ ఉండటంతో బెల్ట్ షాపుల నిర్వాహకులు రెచ్చిపోయారు. అక్రమంగా మద్యం విక్రయిస్తుండడంతో ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఐదు బెల్ట్ షాపులపై దాడి చేసి 59 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బోనాల పండుగ సందర్భంగా వైన్స్‌లను ఎక్సైజ్ అధికారులు మూసివేశారు. ఇదే అదునుగా భావించి బెల్ట్ షాపుల నిర్వాహకులు రెచ్చిపోయారు. గ్రామాల్లోని కిరాణా షాపుల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు మొయినాబాద్ మున్సిపాలిటీ, మండల పరిధిలోని పలు బెల్టుషాపులపై ఆదివారం దాడి చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని అప్పోజీగూడలో సంతోష్ కిరాణా షాప్‌పై దాడి చేసి 16 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని చందానగర్‌లో పాండు కిరాణ షాపుపై దాడి చేసి 5 లీటర్లు, తోలుకట్టలో మల్లేష్ కిరాణ షాపుపై దాడి చేసి 6 లీటర్లు, కనకమామిడిలోని మణికంఠ కిరాణ సాపులో 20 లీటర్లు, వీరస్వామి కిరాణాషాపులో 12 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్ షాపుల నిర్వాహకులను, స్వాధీనం చేసుకున్న 59 లీటర్ల మద్యం బాటిళ్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గచ్చిబౌలి: పీజీ హాస్టల్‌లో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్ తాకడంతో ఓ వ్యక్తి మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న తెలిపిన మేరకు.. నెల్లూరు జిల్లా సీతారాంపురం మండలం గుండుపల్లి గ్రామానికి చెందిన రాచర్ల కొండల్ రావు(43) మూడేళ్లుగా రాయదుర్గంలోని మధురానగర్‌లో సాయిలక్ష్మీ బాలాజీ ఉమెన్స్ పీజీ హాస్టల్‌ను నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఉదయం నీటితో పార్కింగ్‌లో కడుగుతూ డ్రమ్మును జరుపుతుండగా విద్యుత్ తాకింది. విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఓ హస్పిటల్‌కు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు.

కేటీఆర్ వ్యాఖ్యలు అభ్యంతరకరం

పీసీసీ అధికార ప్రతినిధి సతీష్

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో ఒక రాజకీయ పార్టీగా బీఆర్ఎస్ పూర్తిగా వైఫల్యం చెందిందని పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ ఆరోపించారు. ఆదివారం మండల పరిధిలోని నక్కలపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్ల కేటీఆర్ అసభ్యకరంగా మాట్లాడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతేనే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టారన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది ఎంతో విలువైనదో కేటీఆర్ గుర్తించుకోవాలన్నారు. ఇకనైనా కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు మానుకొని అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సహకరించాలని సూచించారు.

వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్య

మీర్‌పేట: వ్యక్తి వేధింపులు తాళలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లాకు చెందిన తన్నీరు ఏడుకొండలు కొన్నేళ్ల క్రితం బతుకుదెరువు కోసం అల్మాస్‌గూడకు వచ్చి నివాసముంటున్నాడు. ఇతనికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె శ్రీలక్ష్మి(21)కి మూగ, చెవిటి. వృత్తిరీత్యా టైలరింగ్ చేస్తోంది. ఇంటి ముందు ఉండే శ్రీకాంత్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. కొంత కాలంగా శ్రీకాంత్ ఆమెను వేధింపులకు గురిచేస్తుండడంతో, మనస్తాపం చెందిన యువతి శనివారం ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి, మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

భవనంపైకి ఎక్కి యువకుడి హల్‌చల్

రాజేంద్రనగర్: నిర్మాణంలో ఉన్న భవనం పైకి ఎక్కిన ఓ యువకుడు కిందికు దూకుతానని మూడు గంటల పాటు పోలీసులను ముప్పతిప్పలు పెట్టిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు అతడిని మాటల్లో పెట్టి చాకచాక్యంగా కిందికు దించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శంషాబాద్ ఘాన్సీమియాగూడకు చెందిన ఎల్లయ్య గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం అత్తాపూర్ సిరిమల్లెనగర్‌కు వచ్చిన అతను నిర్మాణంలో ఉన్న భవనంపైకి ఎక్కి గోడ కట్టెల చివరి అంచున నిలబడి దూకేస్తానని బెదిరించాడు. దీంతో స్థానికులు డయల్ 100కు చేయడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

సస్యరక్షణే ముఖ్యం

మామిడి సాగులో కీలకంగా యాజమాన్య పద్ధతులు
- చెట్ల కొమ్మల కత్తిరింపుతో మెరుగైన ఫలితాలు
- కృషి విజ్ఞాన్ కేంద్రం జిల్లా క్రిడా నిపుణుడు శ్రీకృష్ణ


పంట దిగుబడి పూర్తయిన తర్వాత మామిడి చెట్టు కొమ్మలు కత్తిరిస్తున్న రైతు



కందుకూరు: మామిడిని పండ్లలోనే రారాజుగా పిలుస్తుంటారు. రాష్ట్రంలో సుమారు 2.90 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో సాగులో ఉండగా, దాదాపు 25.5 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుంది. తెలంగాణలో మామిడి పంటను ఉమ్మడి రంగారెడ్డితో పాటు మెదక్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, నల్లగొండ జిల్లాల్లో సాగు చేస్తున్నారు రైతులు. రంగారెడ్డి జిల్లాలో సుమారు 30 వేల హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో మామిడి పంట సాగులో ఉంది. వేసవిలో పంట దిగుబడి అనంతరం ఎండిపోయిన చెట్ల కొమ్మల కత్తిరింపు చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకు జూలై మాసం అనువైనదిగా రైతులు భావిస్తారు. ఉంటుంది. కాగా మామిడి పంటలో ప్రస్తుతం తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, పాటించాల్సిన జాగ్రత్తల గురించి కృషి విజ్ఞాన్ కేంద్రం జిల్లా క్రిడా నిపుణుడు జి.శ్రీకృష్ణ రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు.

అనుకూలమైన నేలలు
మామిడి సాగుకు అన్ని నేలలు అనుకూలం. చౌడు, నీరు నిలువ ఉండే బరువైన నల్లరేగడి నేలల్లో మాత్రం నాటకూడదు. లోతైన నేలల్లో వేర్లు బాగా వ్యాపించి, చెట్లు అభివృద్ధి చెంది చాలా కాలం ఫలాలనిస్తాయి. ఉదజని సూచిక 7.5–8.0 ఉన్న నేలలు మరింత అనుకూలం. మామిడి తోటల్లో చెట్లు బాగా పెరిగి, మంచి దిగుబడులు పొందాలంటే సరియైన పోషకాలు, సమపాళ్లలో అందించడం ఎంతో అవసరం. భూసార పరీక్షల ఆధారంగా పోషకాల లభ్యతను పరిగణలోకి తీసుకుని, సిఫారసు చేసిన ఎరువులను వాడుకోవాలి.

ఎరువుల యాజమాన్యం
తక్కువ వర్షపాతం గల ప్రదేశాల్లో ఎరువులు, పోషక పదార్థాలను వర్షాకాలం ఆరంభంలోనూ, ఎక్కువ వర్షపాతం ఉన్న ప్రదేశాల్లో వర్షాకాలం చివర్లో వేసుకోవడం ద్వారా ఎరువుల వృథాను అరికట్టవచ్చు. వేసవిలో పంట దిగుబడి పూర్తయిన తర్వాత మామిడి చెట్లలో కొమ్మల కత్తిరింపు కీలకంగా ఉంటుంది. దీని ఆధారంగానే తదుపరి పంట దిగుబడి పెరుగుదల ఉంటుంది.

పోషకాల లోపాలకు..
- సూక్ష్మపోషక లోపాలు అధికంగా ఉన్న తోటల్లో చెట్టుకి 50–75 గ్రాముల బోరాక్స్, 125–150 గ్రాముల జింక్‌సల్ఫేట్, 125–150 గ్రా. మెగ్నీషియం సల్ఫేట్ జూలై–ఆగస్టు నెలల్లో పాదుల్లో వేయాలి.
- జింక్, బోరాన్ లోపం తక్షణ నివారణకు 1 గ్రాము చీలేటెడ్ జింకు, 1.25 గ్రాముల బోరాన్(19శాతం), లీటరు నీటికి (125 గ్రా.బోరాన్/100 లీ.నీటికి) కలిపి కొత్త చిగురు వచ్చేటప్పుడు, పూల మొగ్గల పెరుగుదల దశలో ఉన్నప్పుడు చెట్లు బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి.
- ఇనుపధాతులోప నివారణకు 2.5 గ్రాములు, అన్నభేది+1 గ్రాము నిమ్మ ఉప్పు లేదా ఒక బద్ద నిమ్మకాయ రసం లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

పాటించాల్సిన జాగ్రత్తలు
- రైతులు సిఫారసు చేసిన పోషకాలను 50 శాతం పశువుల ఎరువు రూపంలో మిగిలిన 50 శాతం రసాయన ఎరువుల రూపంలో అందించాలి.
- జీవన ఎరువులను సేంద్రియ ఎరువులతో కలిపి చెట్ల పాదుల్లో వేసుకోవాలి. ఆ సమయంలో భూమిలో తగినంత తేమ ఉండేటట్లు జాగ్రత్త తీసుకోవాలి.
- పది సంవత్సరాలు పైబడిన చెట్టుకి సిఫారసు చేసిన సూక్ష్మపోషకాల ద్రావణాన్ని కనీసం 8 లీటర్లు పిచికారీ చేసుకోవాలి.

ముగిసిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

బాలికల డబుల్స్‌లో మెరిసిన జిల్లా క్రీడాకారులు


బాలికల డబుల్స్ ఫైనల్‌లో తలపడుతున్న జిల్లా జట్లు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రం శివారులోని కొండాపూర్ వద్ద గల నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీలో ఈనెల 17న ప్రారంభమైన రాష్ట్రస్థాయి అండర్–19 జూనియర్స్ బాల, బాలికల బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. మంచిర్యాల జిల్లా స్టార్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముఖేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్, రాష్ట్రస్థాయి పోటీల కన్వీనర్లు కిశోర్, వన్నెల భూమన్న నేతృత్వంలో ఈ పోటీలు నిర్వహించారు. 33 జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొనగా 166 మంది క్వాలిఫై అయ్యారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి హాజరయ్యారు. కాసేపు క్రీడాకారులతో సరదాగా బ్యాడ్మింటన్ ఆడారు. ముందుగా ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించగా.. బాలికల డబుల్స్‌లో రంగారెడ్డి జిల్లాకు చెందిన రీదిమ దేవినేని, సరయు సూర్యనేని గెలుపొందారు. రన్నర్లుగా రంగారెడ్డి జిల్లాకు చెందిన చందన గుర్రం, వేదస్వి వాసిరెడ్డి నిలిచారు. బాలుర డబుల్స్‌లో రంగారెడ్డి జిల్లాకు చెందిన అమన్ అనీశ్, యాదజిత్‌రెడ్డి.. సంగారెడ్డి జిల్లాకు చెందిన గిరి వాసన్ సర్వానకుమార్, సాయి సిద్ధార్థ మీద గెలుపొందారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో వరంగల్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన శౌర్య కిరణ్, రిషిత పాండే.. రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలకు చెందిన అమన్ అనీశ్, రియా సుశీల్‌పై గెలుపొందారు. బాలికల సింగిల్స్‌లో ఖమ్మం జిల్లాకు చెందిన ప్రశన్న బోనం.. రంగారెడ్డి జిల్లాకు చెందిన రిషిత పాండేపై విజయం సాధించారు. విజేతలకు ఎమ్మెల్సీ అంజిరెడ్డి మెడల్స్, కప్‌లు అందజేశారు. తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నుంచి వచ్చిన 10 మంది ఎంపైర్లు, రిఫరీ, మ్యాచ్ కంట్రోలర్‌ను సన్మానించారు.

ఇన్‌స్టాలో పరిచయం.. పెళ్లి చేసుకుంటానని మోసం

నిందితుడి అరెస్టు..

బంజారాహిల్స్: ఆమెకు 36..బ్యూటీషియన్‌గా పని చేస్తోంది. ఎనిమిదేళ్ల కుమార్తె కూడా ఉంది. పెళ్లయిన రెండేళ్లకే భర్తతో విభేదాలు కారణంగా కుమార్తెతో కలిసి వెంకటగిరిలో అద్దెకు ఉంటోంది. ఈ నేపథ్యంలో ఆమెకు మూడేళ్ల క్రితం రాజమండ్రికి చెందిన మెకానిక్ మణికంఠ (26)తో ఇన్‌స్టాగామ్‌లో పరిచయం ఏర్పడింది. స్నేహం కాస్తా ప్రేమకు దారితీసింది. మణికంఠ తరచూ రాజమండ్రి నుంచి హైదరాబాద్‌కు వచ్చి ఆమెతో గడిపి వెళ్లేవాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించడంతో కొంత కాలంగా ఇద్దరూ సహజీవనం చేస్తున్నారు. ఈ విషయం మణికంఠ ఇంట్లో తెలియడంతో గొడవ జరిగింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమెతో పెళ్లికి అంగీకరించేది లేదని అతడి తల్లిదండ్రులు తెగేసి చెప్పడంతో మణికంఠ కొంతకాలంగా ఆమెకు దూరంగా ఉంటున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనను మోసం చేశాడని ఆరోపిస్తూ బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు ఆదివారం నిందితుడిని అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

కేఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ


అమ్మవారి పూజలో రాజేశ్వరమ్మ తదితరులు

దోమ: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని కేఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ అన్నారు. ఆదివారం ఆమె మండల పరిధిలోని మోత్కూర్ సమీపంలోని కట్ట మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా రాజేశ్వరమ్మ మాట్లాడుతూ.. మండల ప్రజలు సంతోషంగా ఉండాలని అమ్మ వారికి పూజలు చేశామన్నారు. ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతను అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పురోహితులు కరణం శ్రీకాంత్‌రావు, గ్రామస్తులు మహిపాల్‌రెడ్డి, రామకృష్ణధనేశ్వర్ ముదిరాజ్, ఆనంద్, గోపాల్, రాఘవేందర్, రవికుమార్, చంద్రకాంత్, రాఘవేందర్‌రెడ్డి, ఇస్సయ్య, కిరణ్, శ్రీనివాస్, చెన్నయ్య, సత్యనారాయణ, రమణాజీ, సాయి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కులాంతర వివాహ జంటకు రక్షణ కల్పించండి


ప్రేమ జంటతో కలిసి పోలీసులకు వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

యాలాల: ఇటీవల కులాంతర వివాహం చేసుకున్న ప్రేమ జంటకు రక్షణ కల్పించాలని కోరుతూ ఆదివారం కేవీపీఎస్ సభ్యులు యాలాల ఠాణాలో వినతిపత్రం అందించారు. మండల పరిధిలోని జుంటుపల్లికి చెందిన కర్నె రాకేశ్, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం జిల్లెలగూడకు చెందిన సరిత ప్రేమ వివాహం చేసుకున్నారు. కులాంతర వివాహం చేసుకున్న ఈ జంటకు కేవీపీఎస్, వ్యకాస, ఎమ్మార్పీఎస్ సంఘాలు అండగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య, వ్యకాస జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప తదితరులు ఉన్నారు.

భారీ వర్షం.. నిలిచిన రాకపోకలు


పీరంపల్లిలో రోడ్డుపై వాగు పారడంతో నిలిచిన రాకపోకలు

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్‌తో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో కాల్వలు రోడ్లపై పారాయి. ఆయా గ్రామాలకు వెళ్లే రైతులు, ప్రయాణికులు వరద ఉధృతి తగ్గిన తర్వాత రాకపోకలు సాగించారు.

నిర్లక్ష్యం నిండుకుంది..


నీట మునిగిన అండర్ పాస్

కొత్తగూడ ఫ్లై ఓవర్‌పై భారీగా చేరిన వరద నీరు
- కింద నీట మునిగిన అండర్ పాస్
- వాహనదారుల అవస్థలు
- ఎటూ వెళ్లలేని పరిస్థితి



కొత్తగూడ ఫ్లై ఓవర్‌పై వరద నీరు


కొత్తగూడ జంక్షన్ నుంచి మియాపూర్ వెళ్లే రోడ్డులో..

గచ్చిబౌలి: ఫ్లై ఓవర్‌పై వరద నీరు చేరడం కనీవినీ ఎరగం... కానీ అధికారుల నిర్లక్ష్యంతో ఇప్పుడు ఫ్లైఓవర్‌పై భారీగా వరద చేరడంతో వాహనదారులు ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొంది..ఫ్లై ఓవర్ కింద ఉన్న అండర్ పాస్ నీట మునగడం, మరో వైపు కొత్తగూడ జంక్షన్‌లో భారీగా వరద నీరు చేరడంతో వాహనదారులకు దిక్కుతోచలేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఫ్లై ఓవర్, అండర్ పాస్, జంక్షన్ నీట మునగడం చర్చనీయాంశంగా మారింది. దీనికి హైడ్రా మాన్‌సూన్, జీహెచ్ఎంసీ అధికారులు బాధ్యత వహించాల్సిందేనని వాహనదారులు పేర్కొంటున్నారు.. మ్యాన్‌హోల్స్ కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయంలో శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ నేతృత్వంలో పని చేస్తున్న మాన్‌సూన్ బృందాలు, శేరిలింగంపల్లి సర్కిల్ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. జోనల్ కమిషనర్ అన్ని విభాగాల అధికారులతో వరద పరిస్థితులపై సమన్వయ సమావేశం నిర్వహించినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేయకపోవడంతో భారీగా వరద నీరు చేరినట్లు స్పష్టమవుతోంది. ఫ్లై ఓవర్ పైన, అండర్ పాస్, జంక్షన్‌లో వాహనాల రాకపోకలు ఆగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కిలో మీటరు ప్రయాణానికి దాదాపు 45 నిమిషాలకు పైగా పట్టిందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గోదారిని తలపించిన ఫ్లై ఓవర్
అంజయ్యనగర్ నుంచి కొండాపూర్ ఆర్టీఏ ఆఫీస్ వరకు ఉన్న ఫ్లై ఓవర్ నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారు. శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి కొత్తగూడ ఫ్లై ఓవర్‌పై భారీగా వరద నీరు చేరింది. ప్రతి ఫ్లై ఓవర్‌పై వర్షం వచ్చినప్పుడు ఎప్పటికప్పుడు వరద నీరు వెళ్లేలా ప్రతి 20 అడుగులకు ఓ రంధ్రం, కిందికి ఓ పైపును అమర్చుతారు. ఎంత భారీ వర్షం వచ్చినా ఎలాంటి ఇబ్బంది ఉండదు. కాని నిర్వహణ లేకపోవడంతో చెత్త, ప్లాస్టిక్ కాగితాలతో నిండి పోయాయి. దాదాపుగా అన్ని రంధ్రాలు నిండటంతో వరద నీరు కిందికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో భారీ వర్షానికి ఫ్లై ఓవర్‌పై దాదాపు మూడు అడుగుల లోతు నీరు చేరింది. రాకపోకలకు వీలు లేకుండా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మోటార్లు కాలిపోవడంతో..
వరద నీటిని పరిగణలోకి తీసుకోకుండా సరైనా ప్లాన్ లేకుండా కొత్తగూడ జంక్షన్‌లో అండర్ పాస్‌ను ఏర్పాటు చేశారు. భారీ వర్షం వచ్చినప్పుడు వరద నీటితో నిండి పోవడం, వాహనాల రాకపోకలు స్తంభించడం జరుగుతూనే ఉంది. దీంతో అధికారులు కరెంట్ మోటార్లు బిగించి వచ్చిన వరద వచ్చినట్లే బయటకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం భారీ వర్షానికి వరద నీరు చేరింది. మోటార్లు కాలిపోవడంతో వరదను తొలగించే పరిస్థితి లేకపోవడంతో అండర్ పాస్ పూర్తిగా నిండి పోయింది. డీజిల్ ఇంజన్లతో రాత్రంతా వరద నీటిని తోడారు. వరద నీటి తొలగింపు పేరుతో లక్షలు ఖర్చు చేస్తున్నా ఫలితం కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

జంక్షన్ జామ్..
కొత్తగూడ జంక్షన్‌తో పాటు మియాపూర్ రోడ్డులో భారీగా వరద నీరు చేరింది. హర్ష టయోటా ముందు వరద పోటెత్తడంతో మియాపూర్ నుంచి వచ్చే వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. శుక్రవారం రాత్రి హైడ్రా మాన్‌సూన్ టీం వరదను తొలగించే ప్రయత్నాలు చేసినా గంటల తరబడి వాహనదారులు వరదనీటిలోనే ఉన్నారు. గచ్చిబౌలి నుంచి మియాపూర్, మాదాపూర్ వైపు, మాదాపూర్ నుంచి మియాపూర్ వైపు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.